ఆంధ్రజ్యోతి
andhrajyothy.com గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 35.9, కనిష్ఠం 25.1



ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రుద్రూరు, మే 16: మండలంలోని అంబం శివారులో గల మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల ఇంటర్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ కోసం దరఖాస్తులను చేసుకోవచ్చని కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్ తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు మీ సేవ, ఆన్‌లైన్ సెంటర్‌లో www.telanganams.com వెబ్‌సైట్‌లో ఈనెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎంపీసీ-40, బైపీసీ-40, ఎంఈసీ-40, సీఈసీలో 40 సీట్లు ఉన్నట్లు ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


• నిజాంసాగర్ ప్రాజెక్టుకు జలకళ

వానాకాలం సాగుకు ఢోకా లేదు

- సాగర్ ఆయకట్టు కింద లక్షా 35 వేల ఎకరాలు సస్యశ్యామలం
- ఈ యేడాది యాసంగిలో లక్షా 15వేల ఎకరాల సాగు
- ప్రాజెక్టు నుంచి 10 టీఎంసీల నీటి విడుదల

నిజాంసాగర్, మే 16: ఉభయ జిల్లాల వర ప్రదాయిని నిజాంసాగర్ ప్రాజెక్టు కింద ఈ యేడాది వర్షాకాలంలో సాగునీటికి ఢోకా లేదు. లక్షా 15 వేల ఎకరాలకు ఏడు విడతలుగా ప్రాజెక్టు నుంచి 10 టీఎంసీల నీటిని ఆయకట్టు కింద పంటలకు విడుదల చేశారు. ఈ యేడాది యాసంగిలో రైతులు వరి సాగులో అధిక దిగుబడులు సాధించారు. నిజాంసాగర్ ఆయకట్టు కింద పండిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. వర్షాకాలం సమీపిస్తున్నా ధాన్యం రాశులు మిగిలిపోతున్నాయి. నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి గత నవంబరు నెల నుంచి మే 6 వరకు సాగునీటిని విడుదల చేశారు. ఏడు విడతలుగా నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం నిజాంసాగర్ ప్రాజెక్టులో 1405 అడుగులకు గాను 1391.00 అడుగుల నీటి సామర్థ్యం కలిగి ఉంది. ప్రస్తుతం సాగర్‌లో 4.36 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు అనుకూలంగా ఉంటాయని భావిస్తున్నారు. ప్రస్తుతం సాగర్‌లో ఉన్న నీటినిల్వలకు ఈ యేడాది వర్షాకాలం సాగుకు ఢోకా లేదని పరిశీలకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వర్షా కాలం మరో 25 రోజుల్లోగా ప్రారంభం కానున్నందున ఇప్పటికే వర్షాకాలం సాగుకు సిద్ధమవుతూనే ఉన్నారు. సాగర్‌లో నీటి నిల్వలకు అనుకూలంగా వరి నారుమళ్లు ముందుగానే వేయాలని ప్రణాళిక రూపొందిస్తున్నారు. సాగర్‌ను నమ్ముకున్న రైతాంగానికి ఢోకా లేకుండా ఉండటంతో రైతుల ఆశలు చిగురిస్తున్నాయి. వర్షాకాలంలో ఎగువ ప్రాంతాలలో అడపాదడపా కురిసే వర్షాలకు సాగర్‌లో పూర్తిస్థాయి నీటి నిల్వలు వచ్చి చేరుతా యని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. యాసంగిలో పండించిన లక్షా 15 వేల ఎకరాల్లో వరి పైర్లు పండాయి. ఈ యేడాది వర్షాకాలంలో లక్ష్యానికి మించి వరి పైర్లు సాగు చేసేందుకు సిద్ధం అవుతున్నారని వ్యవసాయాధికారులు తెలిపారు.



వీసీ నియామకానికి గ్రీన్ సిగ్నల్





- తెలంగాణ విశ్వవిద్యాలయ వీసీ నియామకానికి మొదలైన ప్రక్రియ
- ముగ్గురు సభ్యులతో సెర్చ్ కమిటీని నియమించిన ప్రభుత్వం
- కమిటీ ఆధ్వర్యంలోనే 135 మంది దరఖాస్తుల పరిశీలన
- అర్హులైన ముగ్గురిని వీసీ కోసం సిఫారసు చేయనున్న సెర్చ్ కమిటీ

నిజామాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ విశ్వవిద్యాలయం వీసీ నియామకం కోసం ఎట్టకేలకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పూర్తిస్థాయి వీసీని నియమించేందుకు సెర్చ్ కమిటీని నియ మించింది. ఈ కమిటీ ఆధ్వర్యంలో వీసీ నియామకం కోసం ఎంపిక ప్రక్రియను మొదలు పెట్టారు. కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా వీసీని నియమించను న్నారు. విశ్వవిద్యాలయంపై పూర్తిస్థాయిలో నజర్ పెట్టనున్నారు. అకాడమిక్ క్యాలండర్ నుంచి అడ్మినిస్ట్రేటివ్ పనుల వరకు వీసీ లేకపోవడం, ఇన్‌చార్జి వీసీగా ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఉన్నా పూర్తి స్థాయిలో దృష్టి పెట్టకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం కొత్త వీసీని నియామకం చేస్తే తమ సమస్యలు పరిష్కారం అవుతాయని విద్యార్థులు భావిస్తున్నారు. ప్రభుత్వం వీసీ నియామకానికి చర్యలు చేపట్టడంతో ఇప్పటికే దరఖాస్తు చేసిన ప్రొఫెసర్లు ప్రయత్నాల్లో ఉన్నారు. తమకు దగ్గరగా ఉన్న వారి ద్వారా వీసీ పోస్టు కోసం పెద్ద ఎత్తున పైరవీలను చేస్తున్నారు. ప్రభుత్వం ఈ దఫా పని చేసే వారికే వీసీగా అవకాశం ఇవ్వాలని విద్యార్థి సంఘాలతో పాటు విద్యార్థులు కోరుతున్నారు.



21వ తేదీతో ముగియనున్న వీసీ పదవీకాలం

తెలంగాణ వీసీ పదవీకాలం ఈనెల 21తో ముగియనుంది. వీసీగా నియామకం అయిన ప్రొఫెసర్ రవీందర్‌గుప్త పలు వివాదాస్పద నిర్ణయాలు తీసుకున్నారు. ఈసీతో పాటు ప్రభుత్వ అధికారులతో విభేదించారు. విశ్వవిద్యాలయం పరిధిలో తనకు నచ్చిన వారిని రిజిస్ట్రార్లుగా నియామకం చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండానే నిధులు ఖర్చు పెట్టారు. చివరకు ఈసీ సభ్యులతో పాటు విశ్వవిద్యాలయం విద్యార్థులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో విజిలెన్స్‌తో పాటు ప్రత్యేక అధికారులను నియమించి దర్యాప్తు చేశారు. చివరకు వీసీ లంచం తీసు కుంటూ ఏసీ బీకి పట్టుపడటంతో అప్పటి నుంచి ఉన్నత విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం ఇన్‌చార్జి వీసీగా కొనసాగుతు న్నారు.

వీసీల నియామకానికి సెర్చ్ కమిటీలు

రాష్ట్రంలో తెలంగాణ విశ్వవిద్యాలయంతో పాటు ఇతర విశ్వవిద్యాలయాల వీసీల పదవీకాలం ఈ నెల 21న ముగుస్తుండటంతో కొత్త వీసీల నియామకం కోసం ప్రభుత్వం సెర్చ్ కమిటీలను నియమించింది. తెలంగాణ విశ్వవిద్యాలయానికి సెర్చ్ కమిటీ సభ్యులుగా ముగ్గురిని నియమించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్‌గా పనిచేసిన ప్రొఫెసర్ సులే మాన్ సిద్ధిఖి, యూజీసీ తరఫున రాజేశ్వర్ జోషి, ప్రభుత్వం తరఫున రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని నియామకం చేశారు. తెలంగాణ విశ్వవిద్యాలయం వీసీ పోస్టు కోసం మొత్తం 135 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసేవారు పదేళ్లు ప్రొఫెసర్‌గా పనిచేసి ఉండాలి. ఏదైనా విశ్వవిద్యాలయంలో గానీ, డీమ్డ్ యూనివర్సిటీలో కానీ ప్రొఫెసర్‌గా పనిచేయాలి. లేదా పరిశోధన సంస్థల్లో పనిచేసి ఉన్నవారికి కూడా దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులను పరిశీలించి వాటిలో ముగ్గురిని ఎంపిక చేసి ప్రభుత్వానికి పంపిస్తారు. సెర్చ్ కమిటీ ఇచ్చిన నివేదిక అనుగుణంగా ఆ ముగ్గురు సభ్యులలో ఒకరిని ఎంపిక చేయాలని ప్రభుత్వం రాష్ట్ర గవర్నర్‌కు పంపిస్తుంది. ఆ ముగ్గురిలో ఒకరిని వీసీగా గవర్నర్ నియామకం చేయనున్నారు.

పోస్టు కోసం పోటాపోటీ ప్రయత్నాలు

తెలంగాణ విశ్వవిద్యాలయం వీసీ పోస్టు కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో కొంత మంది ఎక్కువ మొత్తంలో ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న వారితో పాటు రాష్ట్రంలోని ఇతర విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్లు, కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్లు ఈ పోస్టు కోసం పోటీ పడుతున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన కొంత మంది ప్రొఫెసర్లతో పాటు ఇతర జిల్లాల ప్రొఫెసర్లు ఈ పోస్టు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లా అధికార పార్టీ ఎమ్మెల్యేలతో పాటు నేతలను కలుస్తూ వీసీగా అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. జిల్లా వారికే ఇవ్వాలని కొంత మంది ప్రొఫెసర్లు నేతలపై ఒత్తిడి కూడా పెంచుతున్నారు. గత వీసీ కాలంలో పలు ఆరోపణలు రావడంతో జిల్లాకు చెందిన అధికార పార్టీ నేతలు కూడా ఎక్కువ మొత్తంలో వీసీ పోస్టుపైన దృష్టి పెట్టడం లేదు. సీఎం వద్దనే మంత్రిత్వ శాఖ ఉండటంతో పనిచేసే వారికి అవకాశం ఇవ్వాలని కోరినట్లు తెలుస్తోంది. విశ్వవిద్యాలయంలో పాలన గాడిలో పెట్టడంతో పాటు వివాదాస్పద నిర్ణయాలు జోలికి వెళ్లకుండా సజావుగా పని జరిగే విధంగా చూడాలని సీఎంకు జిల్లా నేతలు వివరించినట్లు తెలుస్తోంది. వీసీ పోస్టుకు మాత్రం ఎక్కువ మంది దరఖాస్తు చేయడం రాష్ట్రంలోనే అన్ని విశ్వవిద్యాలయాలకు ఒకేసారి వీసీ పోస్టులు భర్తీ చేస్తుండటంతో సామాజిక వర్గాల ఆధారంగా ఈ వీసీల నియామకం జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో ఒక్కొక్క విశ్వవిద్యాలయానికి ఒక్కొక్క వర్గానికి చెందిన ప్రొఫెసర్‌కు అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

పనిచేసే వారికే అవకాశం ఇవ్వాలి

తెలంగాణ విశ్వవిద్యాలయానికి మాత్రం ఈ దఫా పనిచేసే వారికే అవకాశం ఇవ్వాలని విద్యార్థులతో పాటు పలు సంఘాల నేతలు కోరుతున్నారు. ప్రైవేటు కళాశాలల వారు కూడా ఈసీ సభ్యుల ద్వారా ఇదే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. గత వీసీ వివాదాస్పద నిర్ణయాలు తీసుకోవడం పాలనను పట్టించుకోకపోవడం వల్ల సమస్యలు ఏర్పడ్డాయి. నియామకాల నుంచి అకాడమిక్ పనితీరు వరకు ఈ వివాదాస్పద నిర్ణయాలు తీసుకోవడం వల్ల విద్యార్థులకు నష్టం జరిగింది. ఈ దఫా పనిచేసే వారినే నియామకం చేయాలని విద్యార్థి సంఘాల నేతలతో పాటు విద్యార్థులు కోరుతున్నారు.



• ఆర్మూర్‌లోని జీవన్‌రెడ్డి మాల్, మల్టీఫెక్స్

జీవన్‌రెడ్డి మాల్‌కు తాళం


• మాల్ గేట్‌కు తాళం వేస్తున్న అధికారులు

- మాల్‌ను స్వాధీన పర్చుకున్న ఆర్టీసీ అధికారులు
- పెండింగ్‌లో రూ.2కోట్ల 51లక్షల బకాయిలు
- మాల్‌కు నోటీసులు అతికించిన అధికారులు

ఆర్మూర్ టౌన్, మే 16: పట్టణంలోని జీవన్‌రెడ్డి మాల్‌కు ఆర్టీసీ అధికారులు తాళం వేశారు. గురువారం భవనానికి నోటీసులు అతికించి.. తాళం వేసి మాల్‌ను స్వాధీనపర్చు కున్నారు. ఒప్పందం ప్రకారం విష్ణుజిత్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రైవేటు లిమిటెడ్ వారు అద్దె చెల్లించనందు వల్ల హైకోర్టు ఆదేశాల మేరకు స్వాధీనం చేసుకుంటున్నట్టు మైక్‌లో అనౌన్స్‌మెంట్ చేశారు. మాల్‌లో ఉన్న షాప్ యజమానులు ఇందుకు సహకరించాలని ఆర్టీసీ అధికారులు కోరారు. 2013 జూన్ 1వ తేదీన అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఆర్మూర్ బస్టాండ్ సమీపంలో 7059 చదరపు గజాల భూమిని ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రైవేటు లిమిటెడ్ వారికి బిల్డ్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ కింద 33 ఏళ్లకు లీజ్‌కు ఇచ్చింది. అయితే ఆస్థలాన్ని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సతీమణి రజితరెడ్డి టేకోవర్ చేసుకొని 2017లో జీవన్‌రెడ్డి మాల్, మల్టీఫెక్స్ నిర్మించి థర్డ్ పార్టీలకు స్థాళ్లను లీజ్‌కు ఇచ్చారు. అయితే ఒప్పందం ప్రకారం బకాయిలు చెల్లించపోవడంతో ఆర్టీసీ అధికారులు పలుమార్లు నోటీసులు అందజేశారు. దీంతో గత ఏడాది డిసెంబర్‌లో ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రైవేటు లిమిటెడ్ వారు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడంతో జనవరి, ఫిబ్రవరిలో రెండు కోట్ల రూపాయలను చెల్లించారు. మరో నెల రోజుల్లో మిగతా పూర్తి అద్దె చెల్లించాలని హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయితే నెల రోజుల గడువు పూర్తయినా ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న రూ.2కోట్ల 51లక్షల అద్దె బకాయిలను చెల్లించ లేదు. దీంతో ఈనెల 9వ తేదీన ఆర్టీసీ అధికారులు మళ్లీ నోటీసులు జారీ చేశారు. అయినా విష్ణుజిత్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ వారు స్పందించకపోవడంతో గురువారం జీవన్‌రెడ్డి మాల్‌కు నోటీసులను అతికించి స్వాధీనపర్చుకున్నట్టు ఆర్టీసీ అధికారులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం శంకర్, కరీంనగర్ విజిలెన్స్ ఆఫీసర్ బాబురావు, నిజామాబాద్ డీఎం ఆనంద్, ఆర్మూర్ డీఎం ఆంజనేయులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.


మాల్‌కు నోటీసులు అతికిస్తున్న అధికారులు



• మాల్ వద్ద ఫ్లెక్సీని ఏర్పాటు చేసిన అధికారులు

డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ


• బోధన్‌లో..


• ఆర్మూర్‌లో..

జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా వ్యాప్తంగా అవగాహన ర్యాలీలు నిర్వహించారు. గ్రామాల్లోని ప్రజలకు డెంగీ నివారణ, వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించారు. తలనొప్పి, జర్వం వంటి లక్షణాలుంటే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకొని మందులు వాడాలని అధికారులు సూచించారు. దోమల ద్వారా మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, మెదడువాపు, బోదకాలు వంటి సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. నీటి నిల్వలను లేకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు.

-న్యూస్‌నెట్‌వర్క్, నిజామాబాద్



బదిలీలకు అధికారుల యత్నం!

- ఎంపీ ఎన్నికల ఫలితాల తర్వాత బదిలీల కోసం జిల్లా అధికారుల ప్రయత్నాలు
- బదిలీల కోసం ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్న అధికారులు

నిజామాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల ఫలితాల తర్వాత అధికారుల బదిలీలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుండటంతో ముందస్తుగానే ప్రయత్నాలను మొదలు పెట్టారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే ఐఏఎస్, ఐపీఎస్‌లతో పాటు జిల్లాలో పనిచేసే ఎస్సై నుంచి తహసీల్దార్ల వరకు బదిలీలు జరగనున్నాయి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇతర జిల్లాల నుంచి జిల్లాకు వచ్చిన ఈ అధికారులు సొంత జిల్లాలతో పాటు ఇతర జిల్లాలకు బదిలీ కానున్నారు. బదిలీలన్నీ ప్రజాప్రతినిధుల సిఫారసుతో జరగనుండటంతో అధికార పార్టీ నేతల చుట్టూ తిరుగుతున్నారు. వారి లేఖలను తీసుకోవడంతో పాటు తమకు దగ్గరగా ఉన్న ఉన్నతాధికారుల సహకారంతో తమకు అనుకూలంగా ఉన్న జిల్లాలకు వెళ్లేందుకు ఈ ప్రయత్నాలను చేస్తున్నారు.

అసెంబ్లీ ఎన్నికల ముందు భారీగా బదిలీలు

గత శాసనసభ ఎన్నికల ముందు ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా పెద్ద ఎత్తున బదిలీలను చేశారు. ఎస్సై, తహసీల్దార్ నుంచి ఆర్డీవో, డీఎస్పీలతో పాటు ఎస్పీ, కలెక్టర్ల వరకు బదిలీలు జరిగాయి. పార్లమెంట్ ఎన్నికల సమయంలో సొంత జిల్లాలో ఇతర పోస్టులో ఉన్న వారిని కూడా ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. మూడేళ్ల సర్వీసు పూర్తయిన వారితో పాటు ప్రధాన పోస్టులో ఉన్న వారినీ బదిలీ చేశారు.

సొంత జిల్లాలకు ప్రయత్నాలు

పార్లమెంట్ ఎన్నికలు పూర్తి కావడం జూన్ 4న ఫలితాలు వెలువడనుండటంతో ఆ తర్వాత ప్రభుత్వం బదిలీల ప్రక్రియ చేపడుతుందని తెలియడంతో ఎక్కువ మంది సొంత జిల్లాలకు వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ జిల్లా నుంచి ఇతర జిల్లాలకు వెళ్లిన ఎస్సైలు, తహసీల్దార్లు, ఆ పై క్యాడర్ అధికారులు మళ్లీ జిల్లాకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఎన్నికల ప్రక్రియ జూలై 6తో ముగుస్తుం డటంతో ఆ తర్వాత బదిలీ ప్రక్రియ ప్రభుత్వం మొదలు పెట్టనుండటంతో ముందస్తుగా అధికారులు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలతో పాటు నేతలు, సంఘాల ద్వారా ఈ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. కొంత మంది తహసీల్దార్లు, ఎస్సైలు పదోన్నతుల్లో ఉండటం, బదిలీపై వెళ్లిన జిల్లాల్లో పనిచేయడం ఇబ్బందిగా ఉన్నవారు ఈ ప్రయత్నాలు ఎక్కువగా చేస్తున్నారు. ఇతర జిల్లాల నుంచి బదిలీపై ఎన్నికల సమయంలో వచ్చిన అధికా రులు 90శాతానికి పైగా తిరిగి వెళ్లేందుకు సిద్ధమవుతు న్నారు. మల్టీజోన్-1 పరిధిలో ఉన్న వారితో పాటు బాసర జోన్ పరిధిలో ఉన్న అధికారులు ఎక్కువ మొత్తంలో ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్ర స్థాయి జోన్‌గా ఉన్న అధికారులు మాత్రం ఎక్కువ మొత్తంలో హెడ్‌క్వాటర్స్‌కు వెళ్లేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఆధారంగా జిల్లా నుంచి ఎక్కువ మంది అధికారులు ఎన్నికల తర్వాత బదిలీ అయ్యే అవకాశం ఉంది. ఇతర జిల్లాలకు వెళ్లిన జిల్లా అధికారులు ఈ బదిలీల ఆధారంగా తిరిగి రానున్నారు. ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటే మాత్రం మరికొన్ని రోజుల పాటు అధికారులంతా జిల్లాలోనే పనిచేయనున్నారు.










మాట్లాడుతున్న ప్రబంధక్ కమిటీ అధ్యక్షులు అజిత్ సింగ్

అర్హులైన కుటుంబాలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

నవీపేట, మే 16: నవీపేట మార్కెట్ స్థలంలో దశాబ్దాల కాలం నుండి తాత్కాలికంగా నివాసం ఉంటున్న పలువురు కుటుంబాల వారికి ఇళ్ల పట్టాలను అందించాలని బోధన్ గురుద్వార ప్రబంధక్ కమిటీ అధ్యక్షులు అజిత్ సింగ్ కోరారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుమారు 75సంవత్సరాలుగా బాధిత కుటుంబాల వారు స్థానిక మార్కెట్ స్థలంలో తాత్కాలికంగా నివాసం ఉంటూ చేతివృత్తి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. బాధిత కుటుంబాల వారికి ఇళ్ల పట్టాలు అందించాలని పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఈ విషయంపై ఇటీవల హైకోర్టును ఆశ్రయించగా బాధిత కుటుంబాల వారికి న్యాయం చేయాలని ఆదేశించడం జరిగిందని ఆయన వివరించారు. ప్రభుత్వం బాధిత కుటుంబాల వారికి ఇళ్ల పట్టాలను అందించడంతోపాటు ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో మంజిత్ సింగ్, అజిత్‌సింగ్, హర్నామ్‌సింగ్, ఠాగూర్‌సింగ్, తేజసింగ్, నానక్‌సింగ్ పాల్గొన్నారు.







సమాజంతో కలిసి డెంగ్యూని నివారిద్దాం

పెద్దబజార్, మే 16: సమాజంతో కలిసి డెంగ్యూని నియంత్రిద్దామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ అన్నారు. గురువారం నగరంలోని అర్సపల్లిలోగల పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం పురస్కరించుకొని జెండా ఊపి అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగ్యూ నివారణకు సంబంధించిన నినాదాలతో వీధుల గుండా తిరుగుతూ పట్టణ ఆరోగ్య కేంద్రంలో డెంగ్యూ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. మూడు దోమల ద్వారా ఐదు రకాల వ్యాధులు వ్యాపిస్తున్నాయని అందులో మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, మెదడు వాపు, బోధకాలు వంటివి అన్నారు. జిల్లాలో గత సంవత్సరం ఈనెల వరకు నమోదైన కేసు లవరకంటే ఈ సంవత్సరం తక్కువగా నమోదు అయ్యాయన్నారు. కేవలం 115 డెంగ్యూ కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. దీనికి కారణం పరిసరాల పరిశుభ్రత పాటించడం, పల్లెప్రగతి, పట్టణ ప్రగతి లాంటి కార్యక్రమాలు నిర్వహించడం, ప్రతీ శుక్రవారం ఫ్రైడేను నిర్వహించడం, రక్తపూతల సేకరణ ఇలాంటి కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో ఆశలు, ఏఎన్‌ఎంలు, పర్యవేక్షక సిబ్బంది విస్తృతంగా నిర్వహించడం ద్వారానే సాధ్యమైందన్నారు. ముఖ్యంగా డెంగ్యూ రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని దోమలు కుట్టకుండా చూసుకోవాలని వ్యక్తిగతంగా కుటుంబ పరంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమ తెరలను వాడటం, ఇంటి చుట్టూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, పరిసరాలలో నీటినిల్వలను లేకుండా చూసుకోవడం, పారేసిన ప్లాస్టిక్ సంచులు, కప్పులు, టైర్లు, పాత బక్కెట్‌లు, తొట్లు, కొబ్బరి బొండాలు లాంటి వాటిలో నీటి నిలువ లేకుండా శుభ్రపర్చుకోవాలన్నారు. ఏ జ్వరంలోనైనా ప్లేట్లెస్ సంఖ్య తగ్గుతుందని, ఎవరూ భయాందోళనకు గురికావద్దని మన ఇంట్లో ఉన్నటువంటి ద్రవ పదార్థాలను విస్తృతంగా తీసుకుంటూ కొబ్బరినీళ్లు, మజ్జిగ ద్రవ రూపంలో ఆహా రాన్ని తీసుకొని, పారాసిట మల్ టాబ్లెట్ వేసుకుంటూ విశ్రాంతి తీసుకోవడం ద్వారా దీని యొక్క తీవ్రతను తగ్గించవచ్చన్నారు. కార్య క్రమంలో వైద్యాధికారి డాక్టర్ స్మామ్రాట్ యాద వ్, అసిస్టెంట్ మలేరియా అధికారి షేక్ సలీమ్, జిల్లా ఆరోగ్య విద్యాబోధకులు ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు, హెచ్ఈవో శంకర్, మహ్మద్, పర్యవేక్షకులు శ్యామల, స్వామి, షాదుల్లా, రాజు, వైద్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న దృశ్యం


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న నాయకులు

కలెక్టర్‌ను కలిసిన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ నాయకులు

నిజామాబాద్ అర్బన్, మే16: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించినందుకు, అన్ని రకాల వసతులు కల్పించిన కలెక్టర్‌కు జిల్లాకు చెందిన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ నాయకులు కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికలను విజయవంతంగా నిర్వహించినందుకు ఆయనను సన్మానించారు. ఎన్నికల విధులు నిర్వహించిన ఉద్యోగులకు భోజన సదుపాయాలతో పాటు అన్నిరకాల వసతులు కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఉద్యోగ జేఏసీ చైర్మన్ అలుక కిషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు ఆయనను కలిసి గత శాసనసభ ఎన్నికలు, ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల విధులు నిర్వహించిన అధికారులకు, ఉద్యోగులకు ఒకనెల వేతనం చెల్లించాలని వినతిపత్రం అందజేశారు. ఆయనతోపాటు వైస్‌చైర్మన్ అమృత్‌కుమార్, జిల్లా కార్యదర్శి శేఖర్, నారాయణరెడ్డి, శ్రీనివాస్, దేవిసింగ్, ఆకుల ప్రసాద్, తదితరులు ఉన్నారు. టీఎస్‌యుటిఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించినందుకు కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సత్యానంద్, రమేష్, మల్లేష్, గంగాధర్, రాజారాం, తదితరులు పాల్గొన్నారు.

19న ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉచిత పాలిటెక్నిక్ మాక్ టెస్ట్

నిజామాబాద్ అర్బన్, మే 16: ఏబీవీపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 19న ఉచిత పాలిటెక్నిక్ మాక్ టెస్ట్ నిర్వహించనున్నట్లు ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సునీల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏబీవీపీ జిల్లా కార్యాలయంలో ఈ నెల 19న ఉదయం 9గంటల నుంచి మాక్ టెస్ట్ నిర్వహించడం జరు గుతుందని జిల్లాలోని పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు పాలిసెట్‌కు సిద్ధమవుతున్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సాయి, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'హామీని నిలబెట్టుకుంటున్న సీఎం'

మోపాల్, మే16: సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన రుణమాఫీని నిలబెట్టుకుంటున్నారని డీసీసీబీ డైరెక్టర్ గోర్కంటి లింగం అన్నారు. గురువారం మండలంలోని బాడ్సి ప్రాథమిక సహకార సంఘంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు ఆగస్టు 15లోపల 2లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పిన మాట నిలబెట్టుకుంటున్నారని అన్నారు. సీఎం బ్యాంకు అధికారులతోపాటు ఉన్నతాధికారులతో ఈ విషయమై సమీక్ష జరిపారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే ఇందిరమ్మ రాజ్యం అని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని విధాలుగా ఈ ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. రైతులు పండించిన పంటకు 5వేల బోనస్, ఎంఎస్‌పీ ఇప్పించేందుకు కృషిచేస్తున్నారని అన్నారు. రైతులకు విత్తనాలు, ఎరువులు సక్రమంగా అందించేందుకు ఇందిరమ్మ రాజ్యం కృషిచేస్తుందని తెలిపారు. సమావేశంలో సొసైటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, డైరెక్టర్ సాయన్న, ఉన్నారు.

అర్చకులతో దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సమీక్ష

నిజామాబాద్ అర్బన్, మే 16: జిల్లాలోని పలు మండలాలకు చెందిన ఆలయాల అర్చకులతో దేవాదాయ శాఖ సహాయ కమీషనర్ సుప్రియ గురువారం సమీక్ష నిర్వహించారు. నగరంలోని నీలకంఠేశ్వర ఆలయంలో నిర్వహించిన సమీక్షకు డిచ్‌పల్లి, మోపాల్, సిరికొండ, ఆర్మూర్, జక్రాన్‌పల్లి, ధర్పల్లి, ఎడపల్లి, నవీపేట్, రెంజల్, బాల్కొండ, మెండోరా, ముప్కాల్, వేల్పూర్, భీంగల్, ఏర్గట్ల, మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాలకు చెందిన అర్చకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్చకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె అన్నారు.

'అన్నివర్గాల కార్మికులకు ఐఎన్‌టీయూసీ అండగా ఉంటుంది'

పెద్దబజార్, మే16: అన్ని వర్గాల కార్మికులకు ఐఎన్‌టీయూసీ అండగా ఉంటుందని ఐఎన్‌టీయూసీ యూనియన్ ప్రతినిధులు తెలిపారు. గురువారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం అన్నివర్గాల కార్మికులను అన్యాయం చేసిందని అన్నారు. అన్నిరంగాల కార్మికులకు ఉపాధి కల్పించేందుకు తమవంతుగా ఐఎన్‌టీయూసీ కమిటీ ద్వారా పోరాటం చేస్తామని తెలిపారు.

ఐఎన్‌టీయూసీ నూతన కార్యవర్గం ఎన్నిక

గౌరవ అధ్యక్షుడు తాటికొండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణచారి, కోశాధికారి మహేందర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు రాజు, స్వామిలు, కమిటీ సభ్యులు రాము, పవన్, రాజు, డాలర్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.


మండల పరిషత్‌లో మాట్లాడుతున్న ఎంపీపీ

ప్రజలు, అధికారుల సహకారం మరువలేనిది

● ఎంపీపీ సునీత

కోటగిరి, మే 16: కోటగిరి మండల ఎంపీపీగా తనకు అవకాశం కల్పించిన ప్రజలకు, ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అధికారులు తమవంతు సహకారం అందించారని ఎంపీపీ సునీత శ్రీనివాస్‌రావు కొనియాడారు. కోటగిరి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. అరకొరగా ఎంపీటీసీ సభ్యులు సమావేశానికి హాజరయ్యారు. ఆయా శాఖల అధికారులు తమ ఏజెండా అంశాలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సునీత మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కలిసి పని చేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. తనకు సహకరించినట్లే వచ్చే ప్రజాప్రతినిధులకు అధికారులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గంగాధర్‌పటేల్, ఎంపీడీవో మనోహర్ రెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా కేర్ కళాశాల ఫేర్‌వెల్



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

నిజామాబాద్ అర్బన్, మే 16: నగరంలోని కేర్ డిగ్రీ కళాశాల వీడ్కోలు సంబరాలు గురువారం ఘనంగా జరిగాయి. నగరంలోని అంబేద్కర్ భవన్‌లో కళాశాలకు చెందిన మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు ప్రదర్శించిన స్వాగత నృత్యం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ నరాల సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే దేశభక్తి నిండుగా ఉంటుందని గుర్తుచేశారు. మంచిగా చదువుకొని జీవితంలో విజయం సాధించాలన్నారు. కార్యక్రమంలో నరాల స్వప్న, ప్రిన్సిపల్ బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ నరేష్, శంకర్, సందీప్, సందేశ్ పాల్గొన్నారు.

ఐటీఐలలో అడ్మిషన్లు ప్రారంభం

నిజామాబాద్‌అర్బన్, మే16: తెలంగాణ ప్రభుత్వ ఉపాధికల్పన శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పారిశ్రామిక శిక్షణ కేంద్రాలలో (ఐటిఐ)లో 2024 విద్యాసంవత్సరానికి అడ్మిషన్లు గురువారం నుంచి ప్రారంభమైనట్లు జిల్లా కన్వీనర్, ప్రభుత్వ బాలుర ఐటిఐ ప్రిన్సిపల్ కోటిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఐదు ప్రభుత్వ ఐటిఐ లలో 1028 సీట్లు, మూడు ప్రైవేటు ఐటిఐలలో 488 సీట్లు ఉన్నాయని 14 సంవత్స రాల వయస్సుపైబడిన అభ్యర్థులు అర్హులని వయస్సు పరిమితి ఏమీ లేదని దరఖాస్తు చేసుకు నేందుకు జూన్ 10వ తేదీ వరకు అవకాశం ఉందని ఇతర వివరాలకు ఐటిఐ తెలంగాణ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకొని వెబ్ ఆప్షన్స్ పెట్టి అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాలని తెలిపారు. మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్, వెబ్ ఆప్షన్స్ ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ఎస్సెస్సీ మెమో, పుట్టిన తేదీ, ఆధార్ కార్డులు సమర్పించాలని ఆయన తెలిపారు.

నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, మే 16: జిల్లాలోని అర్హత కలిగిన గిరిజన అభ్యర్థులు నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి నాగోరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31 వరకు అర్హులైన అభ్యర్థులు ఓవర్సీస్.ట్రైబల్.జీవోవి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ఈ అవకాశాన్ని జిల్లాకు చెందిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రైవేటు ఆసుపత్రి వైద్యుడి తీరుపై విచారణ

బోధన్‌రూరల్, మే16: బోధన్ పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో బాలికకు అబార్షన్ చేసిన కేసులో ఓ ప్రైవేటు ఆసుపత్రి వైద్యుడికి పోలీసులు విచారించినట్లు తెలుస్తోంది. ఇటీవల ఓ బాలిక గర్భం దాల్చిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బాలిక తల్లిదండ్రులు తప్పనిసరి పరిస్థితులలో ప్రభుత్వ ఆసుపత్రిని ఆశ్రయించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు గర్భస్రావానికి నిరాకరించడంతో సదరుబాలిక తల్లిదండ్రులు పట్టణంలోని ఓప్రైవేటు ఆసుపత్రిని ఆశ్రయించి ప్రైవేటు ఆసుపత్రి వైద్యులు అబార్షన్ చేశారని బాలిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు యువకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆ యువకుడిని జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. అబార్షన్ చేసిన వైద్యుడిని సైతం పోలీసులు విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

'అడ్మిషన్ల పేరుతో డొనేషన్లు వసూలు చేస్తే దాడులు చేస్తాం'

నిజామాబాద్ అర్బన్, మే 16: జిల్లాలోని ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యాసంవత్సరం ప్రారంభం సందర్భంగా అడ్మిషన్ల కోసం డొనేషన్లు వసూలు చేస్తున్నారని అలా వసూలుచేస్తున్న విద్యాసంస్థలపై భౌతిక దాడులకు దిగుతామని వెంటనే డొనేషన్లు నిలిపివేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం అన్నారు. గురువారం నగరంలోని రైల్వేస్టేషన్ వద్ద గల జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వేలాది రూపాయలు డొనేషన్లు వసూలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుందని అలా వసూలు చేస్తున్న పాఠశాలల వివరాలను తమకు అందజేస్తే భౌతిక దాడులకు కూడా సిద్ధమని ఇప్పటికైనా ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థలు తమతీరును మార్చుకోవాలన్నారు. జిల్లావ్యాప్తంగా అనేక పాఠశాలలు అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నారని అయినప్పటికీ విద్యాశాఖ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని, ఇప్పటికైనా అనుమతి లేని పాఠశాలలను మూసివేసి డొనేషన్లు తీసుకుంటున్న పాఠశాలలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు అంజలి, నాయకులు కుశాల్, నవీన్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రఘురాం

హరితహారానికి నర్సరీలు సిద్ధం



నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

ధర్పల్లి, మే 16: వానాకాలంలో చేపట్టే హరితహారానికి నర్సరీలు సిద్ధంగా ఉన్నాయి. మండలంలోని 22 గ్రామ పంచాయతీలో 22 నర్సరీలను హరిత హారానికి సిద్ధం చేశారు. ఒక్కో నర్సరీలో 10వేల మొక్కలను సిద్ధం చేశారు. నర్సరీలో పండ్ల మొక్కలు, పూలమొక్కలతో పాటు నీడను ఇచ్చే మొక్కలను పెంచుతున్నారు. ఇప్పటికే మొక్కలు నాటే ప్రదేశాలను గుర్తించారు. జూన్ మొదటి వారంలో మొక్కలు నాటేందుకు గుంతలను తీయనున్నట్లు ఏపీవో వినోద తెలిపారు. ఆయా గ్రామాల్లో నర్సరీల బాధ్యత పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. నర్సరీల సంరక్షణ కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. నాణ్యతతో కూడిన మట్టిని సేకరించి మొక్కలను పెంచుతున్నారు. ఇందులో ప్రధానంగా గులాబీ, మల్లె, గన్నేరు, జామ, ఉసిరి, నిమ్మ, మామిడి, దానిమ్మ, బొప్పాయి, బాదం, అల్లనేరేడు, ఆకాశ మల్లి, రావి, సీతాఫలం, వేప, కర్జూర, చామంతి, మందారం, తది తర మొక్కలను పెంచుతున్నారు. ప్రతీ మొక్కకు రెండు రూపాయలలోపు వెచ్చించనున్నారు. మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలని ఉపాధి హామీ సిబ్బందికి సూచిస్తున్నారు.

హరితహారం మొక్కలు నాటేందుకు సర్వం సిద్ధం

జూన్‌లో ప్రారంభమయ్యే హరితహారానికి మండలంలోని నర్సరీలు సిద్ధమయ్యాయి. జూన్ మొదటి వారంలో వర్షాలు రాగానే మొక్కలు నాటే ప్రక్రియను వేగవంతం చేస్తాం. ఒక్క నర్సరీలో 10వేల మొక్కలు పెంచుతు న్నాము. హరితహారంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలి. వనసంరక్షణ కోసం అందరూ విజయవంతం చేయాలి.

- ఎండీవో బాలకృష్ణ

ఒక్క సీసీ కెమెరా వంద పోలీసులతో సమానం

● నేర నియంత్రణలో కీలకం : ఎస్సై



ముప్కాల్‌లో సీసీ కెమెరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై భాస్కరచారి

ముప్కాల్, మే16: ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని, నేర నియంత్రణలో, గ్రామ సంరక్షణలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో కీలకమని ముప్కాల్ ఎస్సై భాస్కరచారి అన్నారు. గురువారం ము ప్కాల్ మండల కేంద్రంలోని పోలీస్ కమ్యూనిటీలో భాగంగా ముప్కా ల్ గ్రామ ప్రజలు ఏర్పాటు చేసుకున్న సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీసీ ఉన్న ప్రాంతాల్లో నేరగాళ్ళ ఆటలు సాగవని సూచించారు. దొంగతనం కేసులు, యాక్సిడెంట్ కేసుల్లో, శాంతిభద్రతల విఘాతం కల్పించిన కేసులతో పాటు ఈవ్‌టీజింగ్ కేసులు, అనేక కేసులను చేధించవచ్చని సూచించారు. ప్రస్తుతంనేరనియంత్రణాలో సీసీ కెమెరాలు కీలకంగా మారయన్నారు. అదే విధంగా సైబర్ నేరాలపై అవగాహన కల్పించి, యువత అసాంఘీక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని,యువత మత్తుపదార్థాఆలకు బాని స కావోద్దని ఈ విషయంలో తల్లిదండ్రులు అనునిత్యం గమనిస్తూ ఉం డా లని అన్నారు. సెల్‌ఫోన్‌లో వచ్చే అనవసరమైన లీంక్‌లను ఓపెన్ చేయ కూడదని సూచించారు.ఈకార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది,గ్రామస్థులు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం

బోధన్‌రూరల్,మే16: బోధన్ పట్టణంలోని గోశాల ప్రాంతానికి చెందిన సిద్ధార్థ(14)అనే బాలుడు అదృశ్యమయ్యాడని బోధన్ పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. బాలుడి తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నామన్నారు. సీసీ పుటేజీల ద్వారా త్వరలోనే బాలుడి ఆచూకీ కనుక్కుంటామని తెలిపారు.

హరితహారం చెట్లు అగ్నికి ఆహుతి

● కాల్చిన వారిపై చర్యలు లేవా? ● గ్రామపంచాయతీ అధికారుల పట్టింపు కరువు



నిజామాబాద్ -నందిపేట రోడ్డులో అగ్నికి ఆహుతవుతున్న చెట్లు



దారి పొడవున అగ్నికి ఆహుతి అవడంతో ఎండిపోయిన చెట్లు

సుభాష్‌నగర్, మే 16: గత తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా మొక్కలు నాటాలన్న ఉద్దేశ్యంతో హరితహారం కార్యక్రమాన్ని చేపట్టాయి. మొక్కలు చెట్లుగా మారి దారి పొడవున నీడను ఇస్తున్నాయి. కొందరి అజాగ్రత్త, అలసత్వం వల్ల చెట్లు బూడిద అవుతున్నాయి. ప్రతిసారి రైతులు తమ పొలాల్లో వరి కోసిన అనంతరం వరి మొదళ్లకు నిప్పు పెడుతున్నారు. రైతులు పెట్టిన నిప్పంటుకొని రోడ్డుపై ఉన్న చెట్లను తాకుతున్నాయి. రైతులు వరి మొదళ్లకు నిప్పు పెట్టి వదిలేసి వెళ్లడంతో రోడ్లపై ఉన్న పచ్చని చెట్లు అగ్నికి అహుతి అవుతున్నాయి. ప్రతీ సంవత్సరం ఇలాగే జరుగుతున్న అధికారులు వారిపై చర్యలు తీసుకోవడం లేదు. ఒక్కో మొక్క చెట్టుగా మారడానికి సంవత్సరాలు పడుతున్నాయి. అంత కష్టపడి పెంచిన చెట్లు నిమిషాల్లోనే అగ్నికి ఆహుతి కావడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా చాలా చోట్ల ఇదే పరిస్థితి కొనసాగుతుంది. మేకలు, బర్లు హరితహారం మొక్కలు తినేస్తే జరిమానా విధించే అధికారులు చెట్లు కాలిపోతున్నా పట్టించుకోవడం లేదు. అధికారులు ఇలాంటి వాటిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. నిజామాబాద్, నందిపేట్ మార్గంలో మొక్కలు చెట్లుగా మారి అటుగా వెళ్లేవారికి నీడనిస్తు న్నాయి. ప్రస్తుతం దారి పొడవునా మంటల్లో కాలిపోవడంతో చెట్లు మోడుగా మారిపోయాయి. అవి మళ్లీ చిగురించే పరిస్థితి లేదు. ఇదంతా రోజు అధికారులు చూస్తున్నా కనీసం రైతులకు అవగాహన కల్పించడం లేదు. దీంతో ఏపుగా పెరిగిన చెట్లు అగ్నికి ఆహుతవుతు న్నాయి. రైతులు వరి మొదళ్లకు పెట్టిన నిప్పుతో కాలుష్యంతో పాటు వారి అజాగ్రత్తతో చెట్లు బూడిద అవుతున్నాయి. దీనిపై అధికారులు రైతు లకు అవగాహన కల్పించి మరోసారి ఇలాంటివి జిల్లా వ్యాప్తంగా పునరావృత్తం కాకుండా చూసుకోవాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

శిక్షణ పూర్తి చేసుకుని జీవితంలో స్థిరపడాలి



ఎస్‌బీఐ శిక్షణ కేంద్రంలో సర్టిఫికెట్లు అందజేస్తున్న డైరెక్టర్ శ్రీనివాస్

డిచ్‌పల్లి,మే 16: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వ ర్యంలో నెల రోజుల పాటు మగ్గం ఉచిత శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులు జీవితంలో స్థార పడాలని డైరెక్టర్ శ్రీనివాస్ అన్నారు. గురువారం సాయంత్రం డిచ్‌పల్లిలోని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి కార్యాలయంలో ఉచిత శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికేట్లు అందజేసి వారి ని ఉద్దేశించి మాట్లాడారు. నేర్చుకున్న శిక్షణ జీవితంలో స్థిరపడేందుకు అభ్యర్థులకు ఎంతో ఉపయోగపడుతుందని, ప్రస్తుతం మార్కెట్ లో మగ్గం వర్క్ కు డిమాండ్ ఉందన్నారు. నేర్చుకున్న వారంత ఆయా రంగాల్లో స్వంత వ్యాపారాలు ఏర్పాటు చేసుకొని రాణించాలని సూచించారు. అందుకు అవసరమైన బ్యాంకు రుణ సదుపాయం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కేంద్రం సిబ్బంది భాగ్యలక్ష్మీ, రామకృష్ణ, నవీన్, రంజిత్, పాల్గొన్నారు.

'గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి'

ధర్పల్లి, మే 16: క్రీడాకారులు గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని ఎస్సై విక్రమ్ అన్నా రు. గురువారం మండలంలోని గోవింద్‌పల్లి గ్రామంలో భూషన్ స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆయన క్రీడాకారులనుద్దేశించి మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని ఓటమి గెలుపుకు తొలిమెట్టుగా భావించి క్రీడాకారులు ముందుకు సాగాలన్నారు. యువత గ్రామాల్లో సామాజిక కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. ఈ పోటీలో మొదటి బహుమతి రూ.15వేలు, రెండవ బహుమతి రూ.7వేల నగదును ఇవ్వనున్నారు. క్రీడాకారులు స్నేహపూర్వకంగా క్రీడల్లో పాల్గొనాలని ఎస్సై సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్వహకులు ఆశన్న, అజయ్, నితిన్, రవి, చందర్, శ్రీనివాస్, ప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

మోస్రా,మే16: మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ పురోహితులు నరేష్ అభిషేకం చేసి అలంకరణ చేశారు. అనంతరం భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దీరాజ్, ఆలయ ధర్మకర్త పుష్ప సాయిరాం, భక్తులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

రెంజల్,మే16: మండలంలోని కందకుర్తి గ్రామానికి అనిల్(28)అనే యువకుడు అనుమానస్పద స్థితిలో మృతి చెందాడని ఎస్ఐ సాయన్న తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కందకుర్తి గ్రామానికి చెందిన బొల్లెల్ల అనిల్‌కు మూడెకరాల 20గుంటల భూమి కలదని, ఈ భూమిని తన చెల్లె, బావ పొలాన్ని సాగు చేసుకుంటూ పంట పండించుకునే వారని అనిల్ చెల్లె, బావతో కౌలు డబ్బులు, పట్టాపాసుబుక్ ఇవ్వమని అడుగగా తన చెల్లి, బావ, సంతోష్ అనే వ్యక్తులు తరుచుగా అనిల్‌ను కొడుతుండేవారని, అందుకనే అనిల్ మరణంపై తనకు అనుమానం ఉందని అతని అమ్మమ్మ నాగబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయన్న తెలిపారు.

పన్నులు చెల్లించి గ్రామాల అభివృద్ధికి దోహదపడాలి

డిచ్‌పల్లి,మే16: గ్రామాల కార్యదర్శులు పన్నుల వసూళ్లపై ప్రత్యేక చొరవ చూపాలని ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచా యతీ కార్యదర్శుల సమావేశంలో ఎంపీవో మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక సమస్యలు పరిష్కారం కావాలంటే పన్నులు చెల్లించి గ్రామాలాభివృద్ధికి దోహద పడాలని పిలుపు నిచ్చా రు. గ్రామాల్లో చెల్లించే పన్నుల డబ్బులు సమస్యల పరిష్కారం కోసమే ఖర్చు చేయించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మట్టయ్య ఫారంలో చెట్లను నరికివేత

నవీపేట,మే16: మండలంలోని మట్టయ్య ఫారం గ్రామ శివారులో ప్రధాన రహదారి పక్కన ఉన్న పలు చెట్లను గురువారం విద్యుత్ సిబ్బంది నరికి వేయించారని గ్రామస్థులు తెలిపారు. చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు అడ్డుగా వస్తున్నాయన్న నెపంతో రోడ్డు పక్కన ఉన్న సుమారు 50కి పైగా చెట్లను సిబ్బంది నరికి వేశారని వారు పేర్కొన్నారు. హరితహారంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటగా ప్రస్తుతం మొక్కలు చెట్లుగా మారాయని ఇటువంటి సమయంలో చెట్లను విద్యుత్ సిబ్బంది నరికి వేయడం శోచనీయమని స్థానికులు పేర్కొన్నారు.

సమ్మర్‌క్యాంప్‌లకు క్రీడాకారుల ఎంపిక



సమ్మర్‌క్యాంప్‌కు ఎంపికైన క్రీడాకారులు

ముప్కాల్, మే16: ముప్కాల్ మండల కేంద్రంలోని చైతన్య యువజన సంఘ సమ్మర్ క్యాంప్‌కు గురువారం క్రీడాకారులను ఎంపిక చేసినట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ నిర్వాహకులు తెలిపారు. క్రీడా మైదానంలో సబ్‌జునియర్, జునియర్, అండర్-16, అండర్-20 బాలుర విభాగంలో వందకు పైగా విద్యార్థులు హాజరుకాగా కబడ్డీ క్రీడల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన 50 క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎంపిక చేయబడిన క్రీడాకారులకు ఈనెల 18 నుంచి జూన్ 1వ తేదీ వరకు కబడ్డీ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి అంద్యాల లింగయ్య, కె.గంగాధర్‌లు తెలిపారు. వీరిని శిక్షణ తరగతులు పీడీలురాజ్‌కుమార్, మల్లేష్‌గౌడ్, పీఈటీలు, రిటైర్డు ఉపాధ్యాయులు, యువజన సంఘ నాయకులు ఇవ్వనున్నట్లు తెలిపారు.

బోధన్‌లో పలువురి రక్తదానం





రక్తదానానికి ముందుకు వచ్చిన యువత, రక్తదానం చేస్తున్న యువకుడు

బోధన్ రూరల్, మే 16: ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఈనెల 16న బ్లడ్ బ్యాంకుల్లో రక్తం నిల్వల కొరత కథనానికి హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకులు ప్రమోద్ స్పందిం చారు. బోధన్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో రక్తం నిల్వల కొరత విషయాన్ని తెలుసుకుని తన సన్నిహితులతో కలిసి గురువారం బోధన్ ఆసుపత్రిలోని బ్లడ్ బ్యాంకు విభాగంలో రక్తదానం నిర్వహించారు.పదిమంది యువకులు ఒకేసారి వచ్చిరక్తదానం చేయడంతో బ్లడ్ బ్యాంకులో రక్తం యూనిట్లు పెరిగాయని బ్లడ్ బ్యాంకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుమంత్ అన్నారు. వేసవి కాలంలో రక్తం ఇవ్వడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో విషయం తెలుసుకున్న ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించి స్వచ్ఛందంగా రక్తదానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. రక్తదాన కేంద్రంలో ప్రమోద్, సాకేత్, నిఖిల్, మహేందర్, సాత్విక్, ప్రమోద్, భాను, తదితరులు పాల్గొన్నారు.

'కొయ్యలకు నిప్పు పెడితే భూసారం కోల్పోతుంది'

ఏర్గట్ల, మే 16: యసంగిలో వరి కోతల అనంతరం కొయ్యలను కాల్చడం వల్ల భూ సారం దెబ్బతింటుందని మండల వ్యవసాయాధికారి అబ్దుల్ మాలిక్ తెలిపారు. గురు వారం మండలంలోని రైతులకు వరి పంట కొయ్యలను కాల్చి బూడిత చేస్తే ఏ మాత్రం ప్రయోజనం లేదని, దాంతో భూమి విపరీతంగా వెడెక్కి భూసారం కొల్పోయే ఆ౯కాశం మెండుగా ఉన్నాయని తెలిపారు. పంటలకు మేలు చేసే మిత్ర పురుగులు కూడా మరణిస్తాయని తెలిపారు.

హరితహారం కోసం నర్సరీలో మొక్కలను ఉంచాలి



నర్సరీలో పెంచుతున్న మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీవో

జక్రాన్‌పల్లి, మే16: రానున్న హరితహారం కోసం అన్ని గ్రామాల్లో నర్సరీలలో మొక్కలను సిద్ధంగా ఉంచాలని ఎంపీడీవో సతీష్‌కుమార్ సూచించారు. గురువారం మండలంలోని అర్గుల్ గ్రామంలో నర్సరీలో హరితహారం కోసం పెంచుతున్న మొక్కలను ఆయన పరిశీలించారు. ఇప్పటి నుంచే రానున్న హరితహరం గ్రామాలలో మొక్కలు నాటేం దుకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ఆయన వెంట అర్గుల్ పంచాయతీకార్యదర్శి రాజేశ్వర్, ఫీల్డ్‌అసిస్టెంట్ సాయన్న, తదితరులు ఉన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహాస్వామి జయంతి



గరుడవాహనం పై ఊరేగుతున్న స్వామి

భీమ్‌గల్ రూరల్, మే16: లక్ష్మీనరసింహా స్వామి జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం గ్రామాలయంలో గరుడవాహనం పై ఆశీనులయ్యారు. అర్చకులు ప్రత్యే పూ జలు నిర్వహించి సాయంకాలం ఉత్సవ విగ్రహాలను స్వర్ణలంకార భూషణ చేశారు. ఉత్సవాలను తిలకించడానికి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. స్వామివారికి నారికేలాలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు నంబిపార్థసారధి ఆధ్వర్యంలో ఉత్సవ కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.

నిజామాబాద్ జిల్లా అధికారుల ఫోన్ నెంబర్లు

అధికారి హోదా	ఫోన్ నెంబర్
అదనపు కలెక్టర్	9491036922
అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)	9491036911
ఆర్‌డివో, బోధన్	9491036893
ఆర్‌డివో, ఆర్మూర్	9491036110
ఆర్‌డివో, నిజామాబాద్	9491036891
ఎడి మార్కెటింగ్	8639223401
జిల్లా వ్యవసాయ శాఖ అధికారి	7288894567
మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్	7288879814
సీడ్స్ జిల్లా మేనేజర్	9849908755
లీడ్ బ్యాంక్ మేనేజర్	9866014673
జిల్లా పౌరసరఫరాల అధికారి	8008301506
జిల్లా తూనికల కొలతల శాఖ అధికారి	9849960103
జిల్లా పౌరసరఫరాల మేనేజర్	7995050716
జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ సిఇవో	9848309807
జిల్లా సహకార అధికారి	9100115747
డిప్యూటీ రిజిస్ట్రార్ సహకార శాఖ	7997590472
జిల్లా మేనేజర్, డెయిరీ	9121160536
సూపరింటెండెంట్ ఇంజనీర్, ఎన్‌పిడిసిఎల్	9440811579
జిల్లా ఉపాధి కల్పన అధికారి	9618065756
అసిస్టెంట్ కమిషనర్, దేవాదాయ శాఖ	9491000693
జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్	9440902726
జిల్లా అగ్నిమాపక అధికారి	8712699141
ఎడి, మత్స్యశాఖ అధికారి	9182467008
జిల్లా అటవీశాఖ అధికారి	9440810117
ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్	8106977360
డిప్యూటీ డైరెక్టర్ గ్రౌండ్ వాటర్	7032982026
ఈఈ టిఎస్ ఎంఈఐడిసి	8978680888
ఎడి డ్రగ్స్	8333925825
డిప్యూటీ డైరెక్టర్ ఉద్యానవన శాఖ	7997725309
ఈఈ హౌజింగ్ బోర్డు	9849906422
జోనల్ మేనేజర్ టీఎస్ ఐఐసీ	8187073111
అసిస్టెంట్ డైరెక్టర్, చేనేత శాఖ	9000847666
జిల్లా నీటిపారుదల శాఖ అధికారి	9059119378
సూపరింటెండెంట్ ఇంజనీర్, ఐబి	9701375980
డిప్యూటీ కమీషనర్, కార్మిక శాఖ	9492555343
కార్యదర్శి, జిల్లా గ్రంథాలయ సంస్థ	8978801509
గెజిటెడ్ లైబ్రేరియన్, రీజినల్ లైబ్రరీ	9298153564
అసిస్టెంట్ డైరెక్టర్, గనులు, భూగర్భశాఖ	9440817741
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పబ్లిక్ హెల్త్	6309506351

బోధన్ డివిజన్ అధికారుల సమాచారం

ఆర్డీవో	9491036893
బోధన్ ఏసీపీ	8712659809
బోధన్ మున్సిపల్ ఛైర్‌పర్సన్	8555939494
మున్సిపల్ కమిషనర్	6305249776
తహసీల్దార్	9491036917
రెవెన్యూ ఇన్స్‌స్పెక్టర్	9397970606
శానిటరీ ఇన్స్‌స్పెక్టర్	9676846754
వాతావరణ శాఖ బోధన్	9885865423
ఎక్సైజ్ శాఖ సీఐ	8712658975
పట్టణ సీఐ	8712659870
రూరల్ సీఐ	8712659871
ఐసీడీఎస్ సీడీపీవో	6303829709
ఆర్టీసీ డిపో మేనేజర్	9959226001
ఆర్టీసీ ఎంక్వైరీ	9848500725
రైల్వే స్టేషన్	9491104601
ప్రభుత్వ జూనియర్ కళాశాల	9959951061
మధుమలంచ జూ. కళాశాల	9182389186
ప్రభుత్వ డిగ్రీ కళాశాల	9494027975
వ్యవసాయ శాఖ	7288894588
ఎంపీడీవో	9849900110
ఎంపీవో	9618935060
ఆర్‌డబ్ల్యూఎస్	9550029442

నిజామాబాద్ జిల్లా ప్రభుత్వాసుపత్రి నెంబర్లు

జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్	9849319163
జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి	9652698924
ప్రిన్సిపల్, మెడికల్ కళాశాల	7675980012
ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్, బోధన్	8008553950
జిల్లా కోఆర్డినేటర్ ఆరోగ్యశ్రీ	9160170486
జిల్లా కోఆర్డినేటర్ 108	9908929496
జిల్లా బ్లైండ్ కంట్రోల్ సొసైటీ	9849638931

నిజామాబాద్ జిల్లా విద్యా శాఖ

జిల్లా విద్యాశాఖ అధికారి	7995087611
జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి	9848309005
డిప్యూటీ డైరెక్టర్ అడల్ట్ ఎడ్యుకేషన్	9849909218
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, టిఎస్‌డబ్ల్యుఐడిసీ	9704701603
ప్రభుత్వ గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపల్	9440019918
ప్రిన్సిపల్, కేంద్రీయ విద్యాలయం, నిజామాబాద్	7981734937

కామారెడ్డి జిల్లా అధికారుల ఫోన్ నెంబర్లు

1. కలెక్టర్	8985070097
2. ఎస్పీ	8712686100
3. అదనపు కలెక్టర్	9492022330
4. జిల్లా ప్రణాళిక అధికారి	9989502398
5. డీఈవో	7995087612
6. వ్యవసాయ శాఖాధికారి	7288894623
7. భూగర్భ జలశాఖాధికారి	7032982027
8 డీపీఆర్‌వో	9542430351
9 డీఎస్‌వో	9392920539
10. పౌరసరాఫరాల మేనేజర్	7995050717
11. జిల్లా విద్యుత్ శాఖాధికారి	7901093953
12. జిల్లా మత్స్యశాఖాధికారి	9000422950
13. జిల్లా నీటి పారుదల శాఖాధికారి	7382378219
14. జిల్లామార్కెటింగ్ శాఖాధికారి	7330733215
15. ఐసీడీఎస్ పీడీ	9491160948
16. జిల్లా మార్క్‌ఫెడ్ అధికారి	7288879814
17. జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి	8985631636
18. ఆర్‌టీవో	9618651213
19. డీయంహెచ్‌వో	9441046896
20. జిల్లా పరిషత్ అధికారి	9440394281
21. షెడ్యూల్డ్ కులాల అధికారి	9959205332
22. ఆర్‌డీఓ (కామారెడ్డి)	9491036892
23. డీఎస్‌పీ (కామారెడ్డి)	8712686103
24. మున్సిపల్ కమిషనర్ (కామారెడ్డి)	9849907825
25. ఆర్‌టీసీ (డీఎం)	9959226018
26. ఆర్‌డీవో (ఎల్లారెడ్డి)	9492022119
27. డీఎస్‌పీ (ఎల్లారెడ్డి)	87126686104
28. ఎఫ్‌డీవో	9440810462
29. ఎక్సైజ్ సీఐ	9440902736
30. కమిషనర్ (ఎల్లారెడ్డి)	7815847476
31. నీటిపారుదలశాఖ డీఈ	9440138328
32. పంచాయతీరాజ్ డీఈ	8790717358
33. సీడీపీఓ (ఎల్లారెడ్డి)	9440847096

బాసర ఆలయ సమాచారం



● దేవస్థాన ఫోన్ నెంబర్లు :

కార్యాలయం : 08752-255550
గదుల విచారణ కేంద్రం : 08752-255503
పోలీసుస్టేషన్ : 08752-255120
రైల్వేస్టేషన్ : 08752-255504



- **పూజల వివరాలు :**
  అభిషేకం : ఉదయం 4 గంటల నుంచి 6.30 గంటల వరకు టికెట్ ధర రూ. 500
  - ఒక టికెట్‌పై ఒక కుటుంబ సభ్యులకు అనుమతి
  - సాంప్రదాయ దుస్తులు మాత్రమే ధరించాల్సి ఉంటుంది.
- **అక్షర శ్రీకార పూజ :** ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఆలయంలో రెండు మండపాల్లో జరుగును. ప్రధాన ఆలయం ఎదురుగా ఉన్న మండపంలో రూ. 1000ల టికెట్‌తో, ఆలయం వెలుపల ఉన్న మండపంలో రూ. 150 టిక్కెట్‌తో అక్షర శ్రీకార పూజలు జరిపించుకోవచ్చు.
  ఒక్కో టికెట్‌పై ఒక కుటుంబ సభ్యులకు మాత్రమే ప్రవేశం ఉంటుంది. అదనపు సభ్యులకు అదనపు టికెట్ తీసుకోవాల్సి ఉంటుంది.
- **సాధారణ దర్శనం :** ఉదయం 7 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు భక్తులు అమ్మవారిని దర్శించుకోవచ్చు. ప్రత్యేక దర్శన టికెట్లతో త్వరగా దర్శనం చేసుకునే సౌకర్యం కలదు.
- **ఇతర పూజలు :** ప్రతీ శుక్రవారం సరస్వతీ అమ్మవారికి పల్లకీ సేవా కార్యక్రమం ఉంటుంది. రాత్రి 7.30 గంటలకు అమ్మవారి హారతి సమయంలో సరస్వతి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఆలయ ప్రాంగణంలో ఊరేగిస్తారు. భక్తులు టికెట్ తీసుకొని కార్యక్రమంలో పాల్గొనవచ్చు. అలాగే గంగాహారతి పూజ, గోదావరికి నిత్య హారతి పూజ కూడా ఉంటుంది.
- **వసతి వివరాలు :** దేవస్థానం ఆధ్వర్యంలో ఏసీ, నాన్ ఏసీ గదులు అందుబాటులో కలవు.

దోమకొండ మండల స్థాయి అధికారుల ఫోన్ నెంబర్లు

అధికారులు	సెల్ నంబర్లు:
సంజయ్‌రావ్ తహసీల్దార్ దోమకొండ	94910 36940
సంపత్ కుమార్ సీఐ బిక్కనూర్	87126 86153
మదుసూదన్ అబ్కారీ సీఐ దోమకొండ	87126 58986
రోచిష్మా సీడీపీవో దోమకొండ	80730 66009
కిరణ్ చైతన్య (విద్యుత్)ఏడీఈ దోమకొండ	94906 79219
రమేష్ ఎంపీడీవో దోమకొండ	9281 482061
గణేష్ ఎస్సై దోమకొండ	87126 86156
వెంకటేశ్వర్లువైద్యాధికారి	77805 31747
శివకుమార్ పశువైద్యాధికారి	95338 05080
రజనిఏపీఓ	91212 08299
బాలక్రిష్ణాఈరిగేషన్‌ఏఈ	79817 28050
ప్రదీప్‌కుమార్ ఏఈ(విద్యుత్)	90106 92951
పవన్‌కుమార్ ఏవో	72888 94613
ఎల్లయ్య ఏంఈవో	80087 98510
రాకేష్‌మండల సర్వేయర్	96661 64545
తిరుపతిరెడ్డిఎంపీవో	94402 59151

జిల్లా వ్యాప్తంగా డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ



బోధన్‌లో డెంగీపై అవగాహన ర్యాలీ దృశ్యం



ఏర్గట్లలో అవగాహన ర్యాలీలో పాల్గొన్న పీహెచ్‌సీ సిబ్బంది



మామిడిపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

బోధన్‌రూరల్,మే16: డెంగీ నియంత్రణకు ప్రజలు ముందుండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య అన్నారు. గురువారం డెంగీ దినోత్సవం సందర్భంగా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డెంగ్యూ నియంత్రణలో ప్రజలు ముందుండాలని ఆమె పేర్కొన్నారు. ఇంటి పరిసరాలలో మురికి నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. నివాసపు ఇళ్లలో టైర్లు, తదితర వస్తువులలో వర్షపు నీరు, మురికి నీరు నిల్వ ఉండకుండా చూడాలని, ఏవైనా ఇబ్బందులు ఉంటే వెంటనే మున్సిపల్ కార్యాలయానికి లేదా వైద్యశాఖ కార్యాలయానికి తెలియజేయాలని పేర్కొన్నారు. పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని యుపీఎస్‌ఈ కేంద్రం ఆధ్వర్యంలో గురువారం డెంగీవ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ రమేష్ వచ్చే జూన్ మాసం నుంచి సీజనల్ వ్యాధులు సక్ర మించే అవకాశం ఉందని,డెంగీ జ్వరాలపై కార్నర్ సమావేశాలు ఏర్పాటు చేయా లని ఆరోగ్య సిబ్బంది సూచించారు. డెంగీ వ్యాధి బారిన పడకుండా ప్రజలకు తగు జాగ్రత్తలను సూచించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఫాతిమ ఫిర్దోస్, సబ్‌యూనిట్ ఆఫీసర్ సాయి, హెల్త్‌అసిస్టెంట్ ఆనంద్, బట్టు అనురాధ, కమల, విజయ, రాజవ్వ, చరణ్, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

ధర్పల్లి: డెంగీ వ్యాధి ప్రాణాంతకమైందని ఈ వ్యాధిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి సుశాంత్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోగల ప్రజాపరిషత్ కార్యాలయంలో డెంగీ దినోత్సవం సందర్భంగా మండ లంలోని కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డెంగీవ్యాధిపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో మురికి నీరు నిలువ ఉండకుండా చూడాలన్నారు.ఎడీస్ దోమకాటు వల్ల డెంగీ వ్యాధి వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. దోమలవల్లే వ్యాధి ప్రబలుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎండీవో,హెల్త్‌సూపర్‌వైజర్ ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

రెంజల్: జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు వైద్య అధికారులు వినయ్ కుమార్, సహిసా ఫిర్దోస్, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ కొనసాగించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దోమ తెరలను వాడాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. దోమలు అత్యంత ప్రమాదకరమని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ఇళ్లలో, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల వల్ల వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారులు శ్రావణ్ కుమార్, కరిపె రవీందర్, సూపర్‌వైజర్ మాలంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు తదితరులున్నారు.

కోటగిరి: కోటగిరి ఉమ్మడి మండలంలో గురువారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కోటగిరి, పోతంగల్ మండలాల్లో వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పరిసరాలు అపరిశుభ్రంగా మారితే డెంగ్యూ వ్యాధి సోకుతుందన్నారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జ్యోతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సిరికొండ: జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా ప్రజలకు డెంగీపై అవగాహన కల్పించడానికి వైద్యా ఆరోగ్య సిబ్బంది గురువారం సిరికొండలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అరవింద్ మాట్లాడుతూ.. దోమలను నివారించుకోవడం వల్లె డెంగీ నుంచి బయట పడుతామన్నారు.ప్రధానంగా దోమల కుట్టడం వల్ల డెంగీ వస్తోందని అందు వల్ల దోమలను నివారించుకోవడానికి ప్రజలు ప్రయత్నించాలని డాక్టర్ అరవింద్ కోరారు.

ఇందల్వాయి: ఇందల్వాయి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డెంగీవ్యాధి నియంత్రణ దినోత్సవం సందర్భంగా ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండ్ వరకు ఆరోగ్య విస్తీర్ణ అధికారి శంకర్ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ డెంగీవ్యాధి దోమకాటు వలన వ్యాపిస్తోందని పరిసర ప్రాంతాల్లో దోమలు పెరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి చుట్టుపక్కల నీరు నిలువ ఉండకుండా సెప్టిక్ ట్యాంకులు, పాత టైర్లు, కూలర్లు, పూలకుండీలు తదితర వాటిల్లో నీటిని నిలువ ఉంచకుండా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నిషియన్ అనిత, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలో నవీపేట ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని,దోమల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ కావ్య, సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వర్ రావు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మోర్తాడ్: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆసుపత్రి ఉద్యోగులు, డాక్టర్లు జాతీయ డెంగీ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆసుపత్రి ఇన్‌చార్జీ డాక్టర్ లక్ష్మీ ఆధ్వర్యంలో గురువారం మోర్తాడ్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌లక్ష్మీ,డాక్టర్ పూజ, హెచ్‌ఈవో తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల: జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఆధ్వర్యంలో గురువారం గ్రామంలోని ప్రజలకు డెంగీ నివారణ, వ్యాధి లక్షణాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ ప్రసన్న ప్రియ మాట్లాడుతూ తలనొప్పి, జర్వం రావడం వంటి లక్షణాలుంటే పీహెచ్‌సీ వెంటనే వైద్య పరీక్షలు చేయించుకొని మందులు వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మారుతీ గౌడ్, పండరి, కల్పన, ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.



ఆర్మూర్‌లో డెంగీ వ్యాధి నివారణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



మోర్తాడ్ ఆసుపత్రి నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

జక్రాన్‌పల్లి: రానున్న వర్షాకాలం అయినందున గ్రామాల్లో ప్రజలు డెంగీవ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవా లని వైద్యాధికారులు సూచించారు. గురువారం మండలంలోని జక్రాన్ˊ ఎల్లి, అర్గుల్ గ్రామాల్లో జాతీయ డెంగీ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించి ప్రజలను చైతన్యం చేశారు. ఈ కార్యక్రమంలో అర్గుల్ పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్, వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలు, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో గోవింద్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం జాతీయ డెంగీ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బస్తీ దావఖానా వైద్యాధికారిణి డాక్టర్ ప్రీతిపవని, డాక్టర్ అస్మిన్, రవి, జక్కుల మోహన్, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాకరమైన బావి చుట్టూ కంచె ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



బావి చుట్టూ కంచె వేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

సిరికొండ, మే 16: ప్రమాకరమైన బావి వద్ద గ్రామ పంచాయతీ సిబ్బంది కంచెను ఏర్పాటు చేసి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.'ఆంధ్రజ్యోతి' పత్రికలో గురువారం ప్రమాకరమైన బావి అనే శీర్షిక ప్రచురితమైన వార్త కథనానికి స్పందించిన ఎంపీడీవో లక్ష్మిప్రసాద్ హుస్సేన్‌నగర్ గ్రామ పంచాయతీ సిబ్బందితో బావి వద్ద కంచె ఏర్పాటు చేయించారు. హెచ్చరిక బోర్డును సైతం ఏర్పాటు చేయించారు. బావి వద్ద కంచె ఏర్పాటు చేయడం వల్ల సిరికొండ మహిపాల్ తండా, లొంక తండా ప్రజలు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

రెంజల్, దూపల్లిలో రైతులకు అందుబాటులో జీలుగ విత్తనాలు

రెంజల్,మే16: మండలంలోని రెంజల్, దూపల్లి సొసైటీలలో రైతులకు అందుబాటులో జీలుగ విత్తనాలు ఉన్నాయని వ్యవసాయ అధికారి లక్ష్మికాంత్ రెడ్డి తెలిపారు. దూపల్లి సొసైటీలో 83బస్తాలు, రెంజల్ సొసైటీలో 83బస్తాలు ఉన్నాయని, అవసరమైన రైతులు వ్యవసాయ విస్తీర్ణ అధికారి వద్ద పర్మిట్ తీసుకుని సంబంధిత సొసైటీల్లో జీలువ విత్తనాలు పొందాలన్నారు. ప్రభుత్వం రైతులకు 60శాతం సబ్సిడీతో అందిస్తుందని, 30కేజీల బస్తా 2.5ఎకరాలకు వస్తుందని, దీని ధర రూ.2,790 ఉండగా ప్రభుత్వం సబ్సిడీ ధర రూ.1674 సబ్సిడీతో రైతులు చెల్లించాల్సిన ధర రూ.1116లకే అందించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళకు సిలిండర్ వితరణ

సిరికొండ,మే 16: సిరికొండ గ్రామానికి చెందిన పేద మహిళకు ఉచితంగా వంటగ్యాస్ కనెక్షన్ కాంగ్రెస్ నాయకుడు ఇప్పించారు.దుబ్బాక లక్ష్మి అనే పేద మహిళకు కాంగ్రెస్ నాయకుడు గ్యామ శోభన్ వంటగ్యాస్ కనెక్షన్‌కు,స్వంతగా డబ్బులు చెల్లించి సిలిండర్‌ను, కనెక్షన్ మంజూరి పత్రాల నిగురువారం ఇంటికి వెళ్లి అందజేశారు.

ఉపాధి కూలీలకు రూ.300 ఇవ్వాలి

● అఖిల భారత రైతు కూలీ సంఘం డిమాండ్



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న వెంకన్న

మోపాల్, మే 16:ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలందరికి రూ.300 తగ్గకుండా ఇవ్వాలని ప్రభుత్వాన్ని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకులు వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మోపాల్ మండల కేంద్రంలో జరుగుతున్న ఉపాధి కూలీల దగ్గరికి అఖిల భారత వ్యవ సాయ కార్మిక సంఘం నాయకులు వెళ్లి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ ఎండలో పనిచేసినప్పటికీ కనీసం రూ.150 కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పనిచేసే చోట నీటి వసతి, నీడ వసతి లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని నాయకుల కు వివరించారు. ఈ సందర్భంగా అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సాయాగౌడ్ మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ కూలీలకు ప్రతీ ఒక్కరికి జాబ్‌కార్డు ఇచ్చి సంవత్సరానికి 250 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. వీరి వెంట సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథ మండల కార్యదర్శి గంగబాబులు, పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు ముస్తాబాద్, సాయిబాబాగౌడ్, తదితరులు ఉన్నారు.

ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్‌పై అవగాహన

ఆర్మూర్‌టౌన్, మే16: పట్టణంలోని ఆర్టీసీబస్టాండ్ సమీపంలో ట్రాఫిక్ సీఐ ఓడి రమేష్ గురువారం ఆటోడ్రైవర్‌లకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. ఎక్కడ పడితే అక్కడ రోడ్లపై ఆటోలను నిలిపరాదని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అంజమ్మ, ఎఎస్సై చిన్నయ్య, ట్రాఫిక్ హెడ్‌కానిస్టేబుల్ ఆనంద్, నర్సింగ్‌రావు, నారా యణ, తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ రూ.500 బోనస్ ఇవ్వాలి



నగరంలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



ఆర్మూర్‌లో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సుభాష్‌నగర్, మే 16: రైతులు పండించిన పంటలకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నగర బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో గల ధర్నా చౌక్ వద్ద గురువారం ధర్నా చేట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు నగర మేయర్ దండు నీతూకిరణ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాల్లో ఏ ఒక్కటీ అమలు చేయడం లేదని అన్నారు. ఎన్నికలకు ముందు ఒకమాట ఎన్నికల అనంతరం ఒకమాట మాట్లాడుతూ రైతులను మోసం చేస్తుందన్నారు. డిసెంబర్ 9వ తారీఖు తర్వాత రుణమాఫీ చేస్తానని అధి కారంలోకి వచ్చి వంద రోజులు అవుతున్నా అమలు చేయడం లేదన్నారు. ఆగస్టు 15 తర్వాత రుణమాఫీ చేస్తానని మరోమారు మాటమారుస్తున్నారన్నారు. రైతులు పండించే సన్నవడ్లకు మాత్రమే రూ.500 బోనస్ ఇస్తామని మాట మార్చడం సిగ్గుచేటన్నారు. ప్రతి రైతుకు బేషరతుగా రూ.500 బోనస్ ప్రకటించాలని లేకుంటే రైతులతో కలిసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు వదిలి పెట్టేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో నగరపార్టీ అధ్యక్ష కార్యదర్శులు సిర్పరాజు, ఎనగందుల మురళీ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్ పట్టణంలోని నిజాంసాగర్ కెనాల్‌బ్రిడ్జిపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహిం చారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు మాజీఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆదేశానుసారం బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించి వరిధాన్యానికి క్వింటాలుకు రూ.500బోనస్ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు సన్న వరిధాన్యానికి మాత్రమే బోనస్ ఇస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రకటించిన బోనస్ అందజేయని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళ విభాగం అధ్యక్షురాలు అరుణజ్యోతి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్, మాజీవైస్‌ఎంపీపీ ఇ.గంగాధర్, సుంకరి రవి, నర్మే నవీన్, దుమ్మజి శ్రీనివాస్, అగ్గు క్రాంతి, పృధ్వీరాజ్, మీరశ్రావణ్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో భారీ వర్షం

నిజామాబాద్ అర్బన్, మే16: నగరంలో గురువారం రాత్రి బారీవర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. సుమారు గంటపాటు కురిసిన వర్షానికి నగరంలో రోడ్లన్నీ జలమయయ్యాయి. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న జనాలకు గురువారం రాత్రి కురిసిన వర్షానికి కొంత ఉపశమనం పొందారు. ఈదురు గాలులతో కురిసిన వర్షానికి పలుమార్లు విద్యుత్ అంతరాయం ఏర్పదింది.

ఈవ్‌టీజింగ్ చేస్తే షీటీంకు సమాచారం ఇవ్వాలి

ఆర్మూర్‌టౌన్, మే16: ఎవరైనా మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన, ఈవ్‌టీజింగ్ చేసిన షీటీంకు సమాచారం ఇవ్వాలని షీటీం కానిస్టేబుల్ విగ్నేష్, ప్రిన్సిపాల్ దణవేణిలు విద్యార్థినిలకు సూచించారు. గురువారం పట్టణంలోని సాంఘిక సంక్షేమ మహిళ డిగ్రీ కళాశాలలో సైబర్ క్రైం ల గురించి విద్యార్థినిలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినులు, ఉద్యోగులు, మహిళ లు వేధింపులకు గురైతే పోలీస్ శాఖ సమాచారం అందిస్తే వారి పేర్లు గోప్యంగా ఉంచి రక్షణ కల్పిస్తామని అన్నారు. షీటీం 8712659795 లేదా 100 సమాచారం ఇవ్వాలని సూచించారు. క్యూఆర్ కోడ్ ద్వారా ఫిర్యాదు చేసే విధానాన్ని విద్యార్థినులకు వివరించి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినిలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న షీటీం కానిస్టేబుల్ విగ్నేష్

చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.140	రూ.270	రూ. 290
వెన్‌కాబ్(కిలో)	: రూ.145	రూ.275	రూ. 295

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.73,400	రూ.67,700	రూ.875

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : కృష్ణమ్మ (1.20, 7.25)
: కింగ్ డమ్ ఆఫ్ ది ప్లానెట్ (ఇంగ్లీష్) (4.15)
: అపరిచితుడు (10.20)
స్క్రీన్-2 : ది ఘర్‌ఫీల్డ్ మూవీ (ఇంగ్లీష్ 3డి) (12.00, 2.25, 4.50, 7.15, 9.40)
స్క్రీన్-3 : కర్గమ్ భుగ్గం (హిందీ) (1.10)
: ఆ ఒక్కటి అడక్కు (4.05)
: శ్రీకాంత్ (హిందీ) (7.00, 10.00)
స్క్రీన్-4 : నటరత్నాలు (12.10)
: దర్శిని (2.50)
: మిరల్ (5.30, 10.30)
: అక్కడ వారు ఇక్కడ ఉన్నారు (8.05)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-2 : ది ఘర్‌ఫీల్డ్ మూవీ (ఇంగ్లీష్) (10.45, 4.30, 7.30)
: ఆ ఒక్కటి అడక్కు (1.40)
: మిరల్ (10.30)
స్క్రీన్-3 : అపరిచితుడు (10.35)
: మిరల్ (1.50)
: కింగ్ డమ్ ఆఫ్ ది ప్లానెట్ (తెలుగు) (4.40, 10.30)
: బాక్ (7.30)

దేవి : టిల్లు స్క్వేర్ (11.15, 2.15)
: ఆ ఒక్కటి అడక్కు (6.15, 9.15)
లలితమహాల్ : ప్రతినిధి-2 (11.15, 2.15, 6.15 9.15)
నటరాజ్ : కింగ్ డమ్ ఆఫ్ ది ప్లానెట్ (తెలుగు) (11.15, 2.15, 6.15 9.15)
విజయ్ : కృష్ణమ్మ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్